

# నే చేసింది తప్పా?

జె. లక్ష్మి

"డియర్ మధూ!

ఇన్ని సంవత్సరాల తరువాత ఇలా నా 'లెటర్' చూసి ఆశ్చర్యపోతున్నావు కదూ? ఉత్తరం చివరివరకు ఓపిగ్గా చదువు. యింకా ఆశ్చర్యపోయే విషయాలు చాలా ఉన్నాయ్!

మధూ! నా 'పెళ్ళి' నీకు గుర్తుంది కదూ? అప్పుడు విడిదిలోని 'పెళ్ళికొడుకు'ను చూసి వచ్చిన నువ్వూ, రేణు ఏమన్నారో కూడా గుర్తుండే ఉంటుంది నీకు.

'పెళ్ళికొడుకు చాలా అందంగా ఉన్నాడనీ, ఎంతో మర్యాదగా మాట్లాడాడనీ, అతను చాలా మంచివాడనీ, నేను చాలా అదృష్టవంతురాల్ననీ మీరు నన్ను పొగిడెయ్యడం, ఆ మాటలకు నేను మురిసిపోవడం కూడా నాకిప్పటికీ గుర్తుంది.

కాని, ఆ మురిపం శాశ్వతం కాదని అప్పుడు తెలియలేదు నాకు.

మొదటి రాత్రి 'రాజా' నన్ను మెల్లగా దగ్గరకు తీసుకుంటూ "శాంతీ! నువ్వే నా జీవితానికి శాంతిని ప్రసాదించే దేవతవు. నిన్ను చూచిన క్షణాలెటువంటివో కాని, నిన్ను విడిచి ఉండలేనన్పిస్తోంది. నీ అందంతో నన్ను కట్టేశావు" అన్నారు. ఆ మాటలకు నేను మైమరచి పారవశ్యంగా 'అతని' చేతుల్లో కరిగిపోయాను.

తరువాత నేను 'రాజా' వెంట హైద్రాబాద్ వచ్చేసాను. అంతా మమ్మ్మ చూచి 'ఈర్ష్య' పడేంత ఆనందంగా మా కొత్త కాపురం సాగింది. కన్నెగానే కన్న కలలు, పేర్చుకున్న ఆశలు అన్నీ రాజా నిజం చేస్తుంటే, అతన్ని నేను దైవంగా ఆరాధించేదాన్ని. నేనతన్ని ప్రేమించినంత పిచ్చిగా జీవితంలో మరెవ్వర్నీ ప్రేమించలేదు.

'పువ్వుల్లోపెట్టి పూజించే పెద్ద ఆఫీసరు భర్త. చక్కని బంగళా, వండి పెట్టటానికి మనిషి, షికార్లు కొట్టడానికి కారు, ఓహ్! జీవితానికి మరింకేం కావాలి?' నా బ్రతుకు నందనవనమే అన్పించేది నాకు.

నన్ను చూచి–నేనే ఈర్ష్య పడ్డ క్షణాలు, గర్వపడ్డ ఘడియలు కూడా ఉన్నాయ్.

నేను ఓ క్షణం కన్పించకపోతే 'బ్రతకలేను' అన్నట్టు ఉండేవాడు రాజా.

"శాంతీ! నా కోటెక్కడ?"

"ఏయ్! శాంతీ నా పర్స్ కన్పించదే?"

"శాంతీ! ఓసారిలా రావోయ్!"

ఆఫీసు కెళ్ళేవరకు ఆ నోటికి ఖాళీ ఉండేది కాదు. ఓ క్షణమైనా నన్ను విడిచి ఉండేవాడు కాదు.

ఆఫీసు నుండి రాగానే పిక్చర్‌కో, పార్కుకో వెళ్ళేవాళ్ళం. రాత్రుళ్ళు అన్నం తినిపించమనీ, జోల పాడమనీ, నానా అల్లరీ చేసేవాడు.

అతని చిలిపితనానికి నా వయస్సు ఉరకలు పెట్టేది.

అతనికి నాపైగల ప్రేమకు నా మనస్సు పులకరించేది.

అతనే నా ఆరాధ్య దైవం. రాజాకు నామదిలో అందమైన ఆలయం కట్టి మమతానురాగాలనే పుష్పాలతో అతన్ని పూజించాను.

"శాంతీ నువ్వు లేకపోతే నాకు శాంతే.... ఉండదు!"

"శాంతీ! నిన్ను నాకిచ్చిన ఆ దైవానికి నేనెంతో ఋణపడి ఉన్నాను! నిన్ను పొందిన నేను ఎంత అదృష్టవంతుడ్ని! నా కన్నుల్లో కదిలేది, నా హృదయంలో నివసించేది, నాలో సగమై సదా ఉండేది నువ్వే! జన్మ జన్మలకు నువ్వే కావాలి!" భర్త నోటి నుండి నిత్యం ఇలాంటి మాటలు వింటూంటే ఏ భార్య కరిగి అతనికి దాసి అవదు?

నేను అలానే అతని మాటలకు పొంగిపోయి అతని కనుసన్నలలో మెసిలేదాన్ని. 'అతను లేని నేను లేను' అన్పించేది నాకు. అతన్ని వదలి క్షణం ఉండాలంటే మనస్సు కొట్టుకునేది బాధగా.

కానీ–రాజా నెలకు మూడు వారాలు 'కేంప్'లోనే ఉండేవాడు. తల్లిదండ్రులను కూడా అతని సాన్నిధ్యంలో మర్చిపోయానంటే, అతిశయోక్తి కాదు.

అలా రెండు సంవత్సరాలు అతి మధురంగా 'జీవితం అంటే యిలా ఉండాలి' అనేంత మధురంగా, కాలం ఎలా వెళ్ళిపోతుందో తెలియనంత తియ్యగా జరిగిపోయాయి.

అలాటి నా జీవితం అనుకోకుండా పెద్ద మలుపు, అదే–అతి భయంకరమైన మలుపు తిరిగింది.

ఆ రోజు నా బతుకులో 'అశాంతి' నీడలు పర్చుకునేందుకు పునాది వేసిన రోజు.

రాజా కాంప్ నుండి వచ్చి రెస్టు తీసుకుంటున్నాడు. అతని ప్రక్కనే కూర్చుని-నిద్రపోతున్న అతనివైపు ఆరాధనగా చూస్తూ, అతని క్రాప్‌తో ఆడుకుంటున్నాను. అలాంటి సమయంలో ఫోను మ్రోగింది. 'కాంప్ నుండి వచ్చి గంట కాలేదు. అప్పుడే ఫోన్లు!' అంటూ విసుగ్గా రిసీవర్ అందుకుని, కోపంతో 'హల్లో' అని కూడా నేను అనలేదు. అంతలో అటువైపు నుండి "డియర్! ఏమిటీ లేట్? ఇవాళ 3 గంటలకు సరిగ్గా నా వడిలో ఉంటానని 'ప్రామిస్' చేశావు మర్చిపోయావా? నీ కోసం నేనెంత 'యిది'గా వెయిట్ చేస్తున్నానో నీకెలా చెప్పేది? ప్లీజ్–త్వరగా రా!" అంటూ వినిపించిన ఆడ స్వరానికి ఏమని జవాబు చెప్పాలో తోచక క్షణం తికమకపడి 'రాంగ్ నెంబర్' అని చెపుదామనుకునేంతలో అటు వైపు 'ఫోను' పెట్టేసిన శబ్దం వినిపించింది. మరేం చెయ్యలేక రూమ్‌లో పిచ్చిగా తిరగడం మొదలెట్టాను రాజా లేచేవరకూ—

'రాజా లేవగానే ఈ విషయం చెపుదామా?' అన్పించింది. "ఆఁ ఎందుకులెద్దూ! ఏదో రాంగ్ నెంబర్, అయివుంటుంది. అంత మాత్రానికే చెప్పడం ఎందుకు?" అని సరిపెట్టుకుని – రాజా లేవగానే "ఇవ్వాళ పిక్చర్‌కి వెళదాం" అన్నాను. రాజా మొహం తుడుచుకుంటూ — "చిత్తం! దేవిగారి ఆజ్ఞకు మరి తిరుగుందా? ముందు మా ఆత్మారాముడికి ఏదైనా 'దానా' పడేసి, తరువాత తమరు సింగారం మొదలెట్టండి" అన్నాడు.

అప్పటి వరకు నేననుభవించిన, 'తలనొప్పి'ని యిట్టే మర్చిపోయి హుషారుగా 'కిచెన్' లోకి నడిచాను.

టిఫిన్ ప్లేట్‌తో తిరిగి వస్తున్న నేను గదిలో రాజా ఎవరితోనో ఫోన్లో మాట్లాడ్డం వినిపించి అప్రయత్నంగా గుమ్మం దగ్గరే ఆగిపోయాను.

"వ్వాట్, జయా! యింటికి ఫోన్ చెయ్యవద్దని ఎన్నిసార్లు చెప్పాను? సారీ, డియర్! మర్చిపోయాను. పది నిమిషాల్లో నీ వ డి లో ఉండనూ? ఓ. కె" ఫోన్ పెట్టేసిన శబ్దం వినిపించింది. విషయం అర్థమై, అవనట్లుగా గంద్రగోళం చేసి బుర్రలో నుంచి వింతైన బాధ బయలుదేరింది. 'ట్రే'ని పట్టుకున్న చేతులు [illegible]కాయి.

తూలి పడబోతూ నిలద్రొక్కుకుని, మామూలుగా అవడానికి విశ్వప్రయత్నం చేసి, అతి ప్రయాసపై తెచ్చుకున్న చిరునవ్వుతో, రూమ్‌లో అడుగుపెట్టాను.

టిఫిన్‌ప్లేట్ అందిస్తున్న నన్ను తన రెండు చేతులతోను బంధిస్తూ "శాంతీ! ఈరోజు కలర్ సారీలో నువ్వెంత అందంగా ఉన్నావో తెల్సా!" అంటూ నన్ను ఉక్కిరిబిక్కిరి చేసాడు. అదే మరోసారైతే తన్మయత్వంతో అతని చేతుల్లో ఒదిగిపోయేదాన్ని. కాని యిప్పుడు అతని చేతుల్లోనూ, మాటల్లోనూ, 'నటన' ఉందేమో నన్న అనుమానం కలిగి నా ఒళ్ళు కంపరంగా అన్పించింది. చిన్నగా నవ్వేస్తూ అతని చేతుల్లో నుండి తప్పుకున్నాను.

టిఫిన్ చెయ్యడం పూర్తి అయిన తరువాత అప్పుడే గుర్తుకువచ్చినట్లు "శాంతీ! అయామ్ సారీ, ఇవ్వాళకి పిక్చర్ ప్రోగ్రామ్ కాన్సిల్ చెయ్యి. ఆఫీసునుండి ఫోనొచ్చింది. అర్జంటుగా వెళ్ళాలి. మరి–వెళ్ళనా?" అన్నాడు లేస్తూ.

ఏమనాలో తోచని నేను "ఊఁ" అంటూ మూల్గాను.

"గుడ్! మాశాంతి నిజంగా శాంతే! వస్తా–బై" అంటూ వెళ్ళిపోయాడు. విషయం పూర్తిగా అర్థమైంది నాకు.

అంతటి పచ్చి నిజాన్ని భరించలేని నా హృదయం క్షణం మూగబోయి, మరుక్షణం లోనే తుఫాను ప్రారంభమైంది. నా హృదయం ముక్కలైంది. ఆ హృదయ పీఠంపై ప్రతిష్ఠించుకున్న నా దైవం హఠాత్తుగా, వికృతంగా మారి, నన్ను పరిహసిస్తున్నట్లనిపించింది.

'జరిగిన రెండేళ్ళ కాపురం ఒక నాటకమేనా?' అన్పించింది. రాజా సమర్థుడు. తన నటనను అతి చాకచక్యంతో కప్పిపుచ్చి, నిజమని నన్ను నమ్మించి, నా కళ్ళు కప్పాడు. నాలో ఏదో తెలియని మంట బయలుదేరింది. అది నన్ను నిలువునా దహించడం ప్రారంభించింది. ఆ మంటలో నా 'ప్రేమ' కాలి బూడిదై మిగిలింది. జీవితంలో మొదటిసారిగా 'రంపపు కోతను' అనుభవిస్తూ, అంతులేని 'వ్యధ'తో, అర్థం కాని బాధతో పక్కమీద పడి ఏడ్చాను.

చాలా ప్రొద్దు పోయిం తరువాత వచ్చిన రాజా నన్ను చూస్తూనే "అరె, శాంతీ! ఏమిటిలా ఉన్నావ్? ఒంట్లో బాగుండలేదా? ఏమైనా టాబ్‌లెట్స్ వేసుకున్నావా? డాక్టర్‌కి ఫోన్ చెయ్యనా?" అంటూ హడావిడి పడుతుంటే చెప్పలేని అసహ్యమేసింది. 'యింతకాలం ఈ నటనను నిజం అని నమ్మి ఎంత మోసపోయాను! కళ్ళుండీ గ్రుడ్డిదాన్ని అయాను' అనుకుంటూ అతని వైపు పిచ్చిగా చూస్తూ వుండిపోయాను.

అలా రెండు రోజులు అతని ప్రవర్తన పరిశీలనగా గమనిస్తే, అతని నటన స్పష్టంగా తెలిసిపోయింది. ఏవేవో అడిగి–మండే నా హృదయాన్ని చల్లబరుచుకోవాలని అనిపించేది. కానీ, ఏమని అడగాలో తెలియక ముభావంగా ఉండిపోయాను. అతని స్పర్శ నాకు తేళ్ళూ, జెర్రులూ ప్రాకినట్లు ఉండేది. అందుకే రాజా నన్ను దగ్గరకు తీసుకోబోయినప్పుడల్లా 'ఒంట్లో బాగుండలేద'నే నెపంతో తప్పుకునేదాన్ని.

అలా వారం గడిచింది.

ఒకరోజు రేణు దగ్గర్నుండి లెటర్ వచ్చింది. మా ఆదర్శ దాంపత్యాన్ని చూడడానికి వస్తున్నాననీ స్టేషన్‌కి రమ్మనీ వ్రాసింది. ఇలాంటి సమయంలో రేణు రావడం ఇష్టం లేకున్నా, తప్పనిసరిగా మరుసటిరోజు ఒక్కత్తినే స్టేషన్‌కు వెళ్ళాను. అంతకుముందే రాజా కాంప్ ఉందంటూ వెళ్ళిపోయాడు. అతనితో రేణు వస్తుందనే మాట చెప్పబుద్ధి కాక, ఊరుకున్నాను.

స్టేషన్‌లో 'రేణు' కొరకు వెతుకుతున్న నాకు 'ప్రియురాలు'తో కలసి రైలు ఎక్కుతున్న రాజా దర్శన మిచ్చాడు. రాజా ప్రియురాలు మరెవరోకాదు–పేరుమోసిన వేశ్య–జయకుమారి!

'రేణూ' రానేలేదు.

నేను ఊహించుకుంటున్న దృశ్యం స్పష్టంగా కళ్ళబడేసరికి తల తిరిగి స్పృహ తప్పినంత పనైంది.

యింటికి ఎలా వచ్చానో కూడా తెలియదు. ఆ రోజుతో రాజాపై ఏమూలనో ఉన్న కాస్త అభిమానం, ప్రేమా కూడా రూపుతెలియకుండా పోయాయి.

రాజా నాతో 'కాంప్'కని చెప్పి బయలుదేరేది ప్రియురాలితో విహారాలు చెయ్యడాన్కి – అని అప్పుడు అర్థమైంది.

"అతన్నే దైవంలా పూజించి, మనస్ఫూర్తిగా ప్రేమించి, గౌరవిస్తున్నందుకు రాజా నా కిచ్చే బహుమానం ఇదేనా? నేనుండగా రాజాకి ఆ జయ అవసరం, జయ సాంగత్యం ఎందుకు కావల్సి వచ్చింది? పైకి నేనంటె



## కొత్త వస్తువులు....



ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారు 'నూతన్' అన్న పేరుతో ఒక 'కిరోసిన్ స్టవ్' తయారుచేశారు. మామూలు స్టవ్‌లకంటె, ఇందులో కిరోసిన్ బాగా ఆదా అవుతుందని ఉత్పత్తిదారులు తెలియజేస్తున్నారు. దీని 'బర్నర్'ను కొత్త విధానంలో రూపొందించడం జరిగిందనీ, దానివల్ల 'బ్లూఫ్లేమ్' (నీలం రంగులో వచ్చే మంట) ఏమాత్రం హెచ్చుతగ్గులు లేకుండా బాగా వస్తుందనీ, ఆ మంట స్టవ్ మీది పాత్రకు బాగా తగుల్తుందనీ, వృధాగా పోవడం అంటూ వుండదనీ. స్టవ్ కూడా దిట్టంగా తయారు చెయ్యడంవల్ల, ఎంత పెద్ద పాత్రనయినా అది భరించగలదనీ– ఐ. ఓ. సి. వారు తెలియజేస్తున్నారు. స్టవ్‌లోని కిరోసిన్ (ఇందులో 2 లీటర్లు పదుతుంది) ఎంత వున్నదో తెలిపే సాధనం కూడా దీనికి వున్నదనీ, 'ఫ్లేమ్' హెచ్చుతగ్గులు లేకుండా కావలసినంత మేరలో వాడుకోడానికి తగిన సాధనం కూడా చాలా అనువుగా వుందనీ–వారు తెలియజేస్తున్నారు. ప్రస్తుతం ఈ స్టవ్ ఢిల్లీ, కలకత్తా ప్రాంతాలలో ఇండియన్ ఆయిల్ స్టేషన్స్‌లో లభిస్తుందనీ, త్వరలోనే దక్షిణదేశంలో కూడా ప్రవేశ పెడతామనీ ఐ.ఓ.సి. వారు తెలియజేశారు. ఢిల్లీలో దీని ధర రూ. 32.20 పై. (పన్నులు కాక) అనీ. తక్కిన ప్రాంతాల్లో కూడా. పన్నులతోకలిపి రూ. 35కు మించదనీ – ఐ. ఓ. సి. వారు చెబుతున్నారు.

'ప్రాణం' అంటూ ఎంతగా నటిస్తున్నాడు! డబ్బు కోసం పదిమందికి వళ్ళమ్ముకొనే ఆ జయతోనా నా రాజాకి కాలక్షేపం? రాజా యిలాటి వాడా!" అంటూ నా హృదయం గొల్లుమంది.

పదిరోజులనంతరం తిరిగి వచ్చాడు రాజా.

ఆ పదిరోజులు. రాత్రింబవళ్ళు ఆలోచించి నేను ఒక నిర్ణయానికొచ్చాను.

రాజా వస్తూనే నన్ను చూసి కంగారుగా "శాంతీ! ఏవిటి యిలా ఉన్నావ్? వంట్లో బాగుండటంలేదా?" అంటూ దగ్గరకు తీసుకోబోయాడు. రాజా నలా చూస్తుంటే ఎవ్వరిపైనా ఎప్పుడూ కలగనంత అసహ్యం వేసింది. ఎవరో క్రొత్త వ్యక్తిని చూస్తున్న భ్రాంతి కలిగింది.

"వంట్లోనా? దానికేం బాగానే ఉంది! మనస్సే బాగుండలేదు!" అన్నాను అతన్నుండి దూరంగా జరుగుతూ.

"అదేం? మనస్సెందుకు బాగాలేదు? నేను లేననా?" రాజా కొంటెగా అంటూంటే మరింత అసహ్యమేసింది.

"కాదు! నమ్మినవాళ్ళే మోసగించినందుకు! నేను చిత్తుగా ఓడిపోయినందుకు" మొహం తిప్పుకుంటూ అన్నా.

"మోసమా? ఎవరు మోసంచేశారు నిన్ను?" కనుబొమలు ముదేస్తూ అన్నాడు.

"అదిసరే – టూర్ ఎలా జరిగింది? ఏమంటోంది మీ జయ?" సూటిగాచూస్తూ అడిగాను.

రాజా ఉలిక్కిపడి సర్దుకోవడం. క్షణంలో అతని మొహం తెల్లగా పాలిపోవడం స్పష్టంగా తెల్సిపోయింది.

"టూర్ ఏవిటి? నా జయ ఏవిటి? నీకేమైనా మతిపోయిందా?" బింకంగా బొంకబోయాడు.

"రాజా! నిజం ధైర్యంగా వప్పుకుంటె కొంచెం అయినా నేను సంతోషించేదాన్ని. యిన్నాళ్ళూ నాకు నిజంగానే మతిపోయి మీరే నా సర్వస్వం అని గుడ్డిగానమ్మి మోసపోయాను. మీరింతగా నటించగలరని నేను కలలో కూడా ఊహించలేదు. ఈ రెండేళ్ళ మన కాపురం కేవలం ఒక నాటకంలా మాత్రమే మిగిలిపోయినందుకు నేనెంతో కుమిలిపోతున్నాను—" నా మాటలకు మధ్యలోనే అడ్డుపడ్డాడు రాజా.

"అయామ్ సారీ, శాంతీ! నీకు తెలియనియ్యకూడదనే అనుకున్నాను. అది నా బలహీనత. అయినా నేను జయతో తిరిగినంతమాత్రాన యిపుడు నీకొచ్చిన నష్టం ఏవిటి? నీకేం తక్కువైంది?" రాజా మాటలు నాలో మరింత మంటలను రేపాయి.


"రాజా! ఆడదానికి కావల్సింది తిండీ, బట్టా, కార్లో తిరగడం మాత్రమే కాదు. అంతకంటె ఎక్కువైందీ – ప్రతీ ఇల్లాలు కోరుకునేదీ తన భర్త హృదయంలో తనకు సంపూర్ణమైన స్థానం. అది నాకు ఉన్నదని భ్రమపడి యిన్నాళ్ళూ నేను గర్వపడ్డాను. యిప్పుడు నా భ్రమ తొలగిపోయాక కూడా 'నాకేం తక్కువైందీ?' అని ఆత్మవంచన చేసుకుంటూ నేనుండలేను. మీరు చేసినలాటి తప్పే నేను చేసి క్షమించమని మీ కాళ్ళపైపడితే మీరు క్షమిస్తారా? తమ భార్యలు పరాయి మగాడితో చనువుగా మాట్లాడితేనే సహించలేని మీ మగజాతి–తాము మాత్రం భార్య కళ్ళుకప్పి బజార్ల వెంట పడొచ్చా? యిప్పటివరకు నటించింది చాలు. యిక నేను–ఈ నాటకం నుండి తప్పుకుంటున్నాను" ఆఖరి మాటలన్నప్పుడు నా గుండెల్లో గునపాలే దిగాయి. కళ్ళ నుండి కారే కన్నీటిని రాజా చూడ్డం ఇష్టంలేక మొహం కిటికీ వైపు తిప్పేసుకున్నాను.

"శాంతీ!" అంటూ దగ్గరకు రాబోతున్న రాజాని తప్పించుకుని దూరంగా జరుగుతూ "ప్లీజ్, రాజా! నన్ను తాకాలని ప్రయత్నించకండి. డబ్బు కోసం పదిమందికీ ఒళ్ళమ్ముకునే ఆ జయను తాకిన చేతుల్తో నన్ను తాకొద్దు. యిప్పటికే నా వళ్ళంటే నాకే అసహ్యంగా ఉంది. యిప్పుడు మీరు తాకితే తాకినచోట కాల్చుకుని ప్రాయశ్చిత్తం చేసుకుంటాను" తీక్షణంగా అన్నాను.


"శాంతీ! ఏమిటీ వాగుడు? పోనీ అనుకుంటూంటే మితిమీరుతున్నావ్! నేను మగాణ్ణి తెలుసా? నా యిష్టం వచ్చినట్లు తిరుగుతాను. ఏం చేస్తావ్? నీ కంటె ముందే నాకు చాలామంది ఆడవాళ్ళతో పరిచయం ఉంది! ఏం? తప్పా? నువ్వెంత బెదిరించి ఏడ్చినా నేను జయను మాత్రం వదులుకోలేను. నోరుమూసుకుని పడివుండు."

# చిలకల ముగ్గు

మొదట ఒకదానికొకటి సమాన దూరంలో ఉండేలా 21 చుక్కలు ఒక వరుసలో ఉంచాలి. ఆ తర్వాత ఆ వరుసకు అటూ ఇటూ ఒక్కొక్క చుక్క చొప్పున తగ్గిస్తూ అలా రెండువైపులా 11 చుక్కలున్న వరుసలు వచ్చేదాకా చుక్కలు పెట్టుకోవాలి.



ఆ తర్వాత 21 చుక్కలున్న వరుసలో మధ్య ఉన్న చుక్క చుట్టూ ఒక వృత్తం గీచి - దానిచుట్టూ ఉన్న చుక్కలు కలిపి చిత్రం-1లో చూపినట్లు నక్షత్రం ఒకటి రూపొందించాలి. ఆ తర్వాత దాని చుట్టూ మరో నక్షత్రం ఆకారం రూపొందించాలి. ఇక చిత్రం-1లో చూపిన ఆరు కొనల దగ్గరా చిత్రంలో చూపినట్టు-ఆకులూ తీగెలూ గియ్యాలి. తక్కిన చుక్కలను కలిపితే చిలుకల ఆకారాలు వస్తాయి. మొదట చిలుక కంటితో ప్రారంభిస్తే ముగ్గు బాగా కుదురుతుంది. (చిత్రం-2లో పూర్తయిన ముగ్గు కనిపిస్తున్నది). రంగులతో అలంకరిస్తే ఈ ముగ్గు మరింత బావుంటుంది.



నటన పోయి అసలు స్వరూపం బయట పడిందా రోజు!

చేసిన తప్పుకు 'సిగ్గు' పడక పైగా నన్నే నోరుమూసుకోమని వెళ్ళిపోయాడు బయటకు.

మళ్ళీ 'రాజా' వచ్చేసరికి నేను అమ్మా వాళ్ళింటికి వచ్చేసాను. ఎవరిమీదో తెలియని వెర్రి కోపంతో చావాలనుకున్నాను. కాని నా మనస్సు హెచ్చరించింది. చచ్చి ఎవర్ని సాధిస్తావు? ఒక మగాడు చేసిన వంచనకు చనిపోవడం పిరికితనమే అవుతుంది! నువ్వు అంత పిరికిదానివా? నీ అంతట నీవు బ్రతకలేవా? నువ్వు పుట్టినందుకు కొంతయినా సేవచేసి నీ మాతృ దేశపు ఋణం తీర్చుకో! యిక 'నీ ప్రజలకోసం' బ్రతుకు! అంటూ నావివేకాన్ని, మానవత్వాన్ని తట్టి లేపింది.

అందుకే చనిపోయే ప్రయత్నం మాని 'నర్సింగ్'కి వెళ్ళాను. ట్రైనింగ్‌కి వెళ్ళే రోజు అమ్మ చాలా గొడవచేసింది. తిరిగి 'రాజా' దగ్గరకు వెళ్ళిపొమ్మని అన్నయ్య హితబోధ చేశాడు. కానీ నా మనస్సు మారలేదు. యిక ముందు మారదు కూడా.

మాధవీ!

ఇప్పుడు నేను 'సిష్టర్ శాంతి'ని. 'ట్రైనింగ్' పూర్తిచేసి 'జాబ్' చేస్తున్నాను. ఇక్కడ ఈరోగులనూ, చిన్నారి పాపల్ని చూసి నన్ను నేనే మర్చిపోతాను. నాలో యిప్పుడు ఎలాంటి కోరికలూ, బాధలూలేవు. నా మనస్సెప్పుడూ హాయిగా, ప్రశాంతంగా ఉంటోంది.

మధూ! నే చేసిన పని తప్పా? 'శీలం' అనేది మనసున్న ప్రతివాళ్ళ ప్రాణం కంటె ఎక్కువైతే, పవిత్రంగా కాపాడుకోవల్సిందే కదా? 'శీలం' పోగొట్టుకున్న ఆడది పతిత—శీలం లేని మగాడు మొనగాడూనా? తన భార్య పవిత్రంగా ఉండాలని భర్త కోరుకున్నట్లే, తన భర్త కూడా అంత పవిత్రంగానూ ఉండాలని భార్య కోరుకోవడం తప్పా? 'శీలం' లేని భార్యను భర్త తిరస్కరించినట్లే—'శీలం' లేని భర్తను భార్య తిరస్కరిస్తే నేరమా? మన బంధువులందరూ నాకు 'మొగుడ్ని వదిలేసింది' అనే బిరుదిచ్చారు. మరి నువ్వేమంటావో! వెంటనే జవాబు వ్రాయి.''

నీ
శాంతి

*